# తాము మరణిస్తూ.. మరికొందరికి అవయవ దానం


జోగు చంద్రయ్య (ఫైల్)


హన్మంత రెడ్డి (ఫైల్)

ఖైరతాబాద్, డిసెంబర్ 26 : తాము మరణిస్తూ పలువురికి అవయవదానం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పరిధిలోని వంగపల్లికి చెందిన జోగు చంద్రయ్య (48) రోజు కూలీ. తండ్రి జోగు బాలలింగం, భార్య పూలమ్మ, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఈ నెల 23న చంద్రయ్య బైక్ పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ చంద్రయ్యను సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 25న బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబ సభ్యులను జీవన్‌దాన్ ప్రతినిధులు కలిసి అవయవదానం విశిష్టతను వివరించగా వారు అంగీకరించారు. చంద్రయ్య శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు, కండ్లను సేకరించారు.

### ఆరుగురికి అవయవదానం..

మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ కరవేనాకు చెందిన గంగుల లక్ష్మారెడ్డి, నాగమణి దంపతుల కుమారుడు హన్మంత్ రెడ్డి (24) ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 22న తాను బైక్ పై వెళ్తూ అదుపుతప్పి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స కోసం ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు 24న బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. జీవన్‌దాన్ ప్రతినిధుల కౌన్సిలింగ్‌తో అవయవదానానికి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. కాలేయం, రెండు మూత్రపిండాలు, కండ్లతో పాటు ఓ ఊపిరితిత్తిని సేకరించారు. అత్యవసర రోగులకు అవయవాలను అందజేస్తామని వైద్యులు తెలిపారు. అవయవ దానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులను జీవన్‌దాన్ అభినందించింది.




# 28న ఓపెన్ యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- యూనివర్సిటీ నుంచి మొత్తం 31,729 మందికి పట్టాలు
- వివరాలు వెల్లడించిన వీసీ ప్రొఫెసర్ సీతారామారావు

సిటీబ్యూరో, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 28న నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీకి చెందిన 43 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీసీ ప్రొఫెసర్ సీతారామారావు మాట్లాడుతూ... యూనివర్సిటీలో మొత్తం 43 మంది విద్యార్థులు బంగారు పతకాలకు ఎంపికయ్యారని తెలిపారు. స్నాతకోత్సవంలో యూనివర్సిటీ నుంచి మొత్తం 31,729 మందికి పట్టాలు ప్రదానం చేయనున్నామని, వారిలో 20,972 మంది యూజీ, 10,757 మంది పీజీలో పట్టాలు అందుకోనున్నట్లు తెలిపారు. వివిధ జైళ్లలో ఉన్న 148 ఖైదీలకు ఈ సందర్భంగా డిగ్రీ పట్టాలను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. జూబ్లీహిల్స్‌లో ఉన్న బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈ నెల 28న సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న 25వ స్నాతకోత్సవానికి యూనివర్సిటీ చాన్స్‌లర్ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరుకానున్నారు. యూనివర్సిటీకి చెందిన కీ నోట్ ప్రజంటేషన్‌ను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీష్‌కుమార్ చేయనున్నారు. అలాగే మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నామని యూనివర్సిటీ వీసీ పేర్కొన్నారు. అనంతరం యూనివర్సిటీ అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. రెగ్యులర్‌గా కాలేజీలకు వెళ్లి చదువుకోలేని వారికి, గృహిణులు, ఉద్యోగస్తులకు అందుబాటులో ఉండే విధంగా బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అన్ని రకాల కోర్సులు అందిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఎన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.వెంకటరమణ, వివిధ విభాగాలకు చెందిన హెచ్‌వోడీలు, డీన్‌లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 1 నుంచి నుమాయిష్

- 46 రోజుల పాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్
- దాదాపు 2400 స్టాళ్ల నిర్మాణం
- కొలువుదీరనున్న పారిశ్రామిక ఉత్పత్తులు, ఫుడ్ కోర్టులు, అమ్యూజ్‌మెంట్ పార్కులు
- వేగంగా కొనసాగుతున్న స్టాళ్ల నిర్మాణ పనులు
- విజయవంతంగా నిర్వహించేందుకు సొసైటీ ప్రతినిధులు కృషి
- విద్యావ్యాప్తికి కృషి చేస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ



ఎగ్జిబిషన్ ప్రధాన మార్గం


ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేస్తున్న అమ్యూజ్‌మెంట్ పార్క్

అబిడ్స్, డిసెంబర్ 26: దేశంలోని వివిధ ప్రాంతాల్లో తయారైన పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు చేపట్టేందుకు నగరంలో నిర్వహించనున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(ఎగ్జిబిషన్) ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన నిర్వహిస్తారు. ఇందులో దాదాపు 2400 స్టాళ్ల నిర్మాణం చేసేందుకు నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు స్టాళ్ల కేటాయింపు చివరి దశకు చేరుకుంది. ఇప్పటి వరకు స్టాళ్లను పొందిన నిర్వాహకులకు స్టాళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జనవరి 1 ప్రారంభం నాటికి దాదాపు అన్ని స్టాళ్ల ఏర్పాట్లు పూర్తయ్యేలా ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు నేతృత్వంలో సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి ఈ.రాజేందర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 1938 సంవత్సరంలో ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ నేతృత్వంలో ప్రారంభమైన ఈ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన అప్పట్లో నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించే వారు. ఆ తరువాత 1946లో నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలోని 26 ఎకరాల సువిశాలమైన స్థలంలో నిర్వహిస్తూ వస్తున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌కు దేశ, విదేశాల్లో ప్రాముఖ్యత సంతరించుకుంది. ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు 46 రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు ప్రజాదరణ ఉంది. దీంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన ఉత్పత్తులకు విస్తృత ప్రచారం లభించడంతో వాటి విక్రయాలకు కేంద్రంగా నిలిచింది. ప్రతి సంవత్సరం దాదాపు 25 లక్షల మంది సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు. సుమారు 2400 స్టాళ్ల ఏర్పాటుతో కొనసాగే ఈ ఎగ్జిబిషన్ నగర ప్రజలనే కాకుండా పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి సందర్శనకు వచ్చే వారిని అలరిస్తోంది. పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల స్టాళ్లు, ఫుడ్ కోర్టులు, సందర్శకులను అలరించేందుకు అమ్యూజ్‌మెంట్ పార్క్ ఇలా అనేక స్టాళ్లు ఎగ్జిబిషన్‌లో కొలువుదీరనున్నాయి. ఇప్పటికే దాదాపు స్టాళ్ల కేటాయింపులు పూర్తి కావస్తుండటంతో పలు స్టాళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు సాగుతున్నాయి.

### ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేసేందుకు చర్యలు..

మొత్తం 32 సబ్ కమిటీలను ఏర్పాటు చేసి ఆయా కమిటీల సహకారంతో ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేసేందుకు సొసైటీ ప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రవేశ రుసుము గత సంవత్సరం మాదిరిగానే రూ.40 నిర్ణయించడంతో పాటు క్షణాల్లో ఎగ్జిబిషన్‌ను చుట్టుముట్టి వచ్చేందుకు ఏర్పాటు చేసిన మినీ ట్రైన్‌కు రూ.30 ధరను నిర్ణయించారు. గత సంవత్సరం దాదాపు 25 లక్షల వరకు సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శించగా, ఈ సంవత్సరం అంతకంటే ఎక్కువ మంది సందర్శకులు తరలి వచ్చేలా సొసైటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

### రాష్ట్రంలో మహిళా విద్యా వ్యాప్తికి కృషి

ఎగ్జిబిషన్ నిర్వహణ ద్వారా వస్తున్న ఆదాయంతో ఎగ్జిబిషన్ సొసైటీ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విద్యా వ్యాప్తికి కృషి చేస్తోంది. ముఖ్యంగా మహిళా విద్యా వ్యాప్తికి గాను మహిళా కళాశాలలు, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజినీరింగ్, డిగ్రీ, ఐటీఐ కళాశాలలను స్థాపించి విద్యా వ్యాప్తికి పాటు పడుతోంది. పలు జిల్లాల్లో ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో 20 విద్యా సంస్థలు కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం ఆయా విద్యా సంస్థల ద్వారా దాదాపు 30 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

### స్టాళ్ల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి..



జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు వచ్చే సందర్శకుల కోసం మరిన్ని వసతులు కల్పిస్తున్నాం. ఎగ్జిబిషన్‌ను పురస్కరించుకొని స్టాళ్ల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. 32 సబ్ కమిటీలను ఏర్పాటు చేసి సందర్శకులకు అన్ని విధాల సౌకర్యాలను కల్పించి, ఎగ్జిబిషన్ విజయవంతం అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– వనం సత్యేందర్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు


స్టాల్ నిర్మాణ పనులను చేపడుతున్న కార్మికులు

### కనువిందు చేసేలా..



జనవరి 1వ తేదీ నుంచి నుమాయిష్ ప్రారంభం కానున్నది. నుమాయిష్‌కు నగరం నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా సందర్శకులు వస్తారు. కనువిందు చేసేందుకు మైదానంలో అమ్యూజ్‌మెంట్ పార్క్‌లు, స్టాళ్ల ఏర్పాటు జరుగుతోంది. ప్రారంభోత్సవం నాటికి దాదాపు స్టాళ్ల ఏర్పాట్లు పూర్తయ్యేలా చూస్తున్నాం.

– ఏనుగుల రాజేందర్, సొసైటీ కోశాధికారి

### సందర్శకులకు మరిన్ని వసతులు



ఎగ్జిబిషన్ నిర్వహించే 46 రోజుల పాటు సందర్శకులకు అన్ని రకాల వసతులు కల్పిస్తాం. సందర్శకులకు తక్కువ ధరలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నాం. ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక సెక్యూరిటీతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నాం. అంతర్గత భద్రతతో పాటు పోలీసుల ద్వారా ప్రత్యేక భద్రత చర్యలు తీసుకుంటున్నాం.

– హనుమంతరావు, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి

# నేడు జస్టిస్ కొండా మాధవరెడ్డి పోస్టల్ కవర్ ఆవిష్కరణ

హాజరుకానున్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్



సిటీబ్యూరో, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ): జస్టిస్ కొండా మాధవరెడ్డి 100వ జయంతి సందర్భంగా న్యాయ వ్యవస్థలో అందించిన సేవల గౌరవార్థం ఆయన పేరు మీద పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించనున్నారు. బుధవారం సాయంత్రం గగన్‌మహల్‌లోని ఏవీ కళాశాలలో 4.45 గంటలకు జరిగే కార్యక్రమానికి భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించనున్నట్లు జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ అతిథిగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌తో పాటు తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి, మాజీ అదనపు సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా వి.రాజగోపాల్‌రెడ్డి హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ కొండా మాధవరెడ్డి పోస్టల్ కవర్‌ను ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఆవిష్కరించనున్నారు. పలువురు న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులు హాజరుకానున్నట్లు తెలిపారు.

# రాష్ట్రపతి నిలయంలో సందర్శకుల సందడి

1000 మంది పర్యాటకులు సందర్శన



సిటీబ్యూరో, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): గత వారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్రపతి అనంతరం తిరిగి ఢిల్లీ వెళ్లిపోయారు. మంగళవారం రాష్ట్రపతి నిలయంలోకి పర్యాటకులకు అనుమతి ఇవ్వడంతో ఉత్సాహంగా తరలివచ్చారు. సుమారు 1000 మంది వరకు విజిటర్స్ రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. అయితే నేటి నుంచి సందర్శకుల తాకిడి పెరగనున్నట్లు వివరించారు.

# చలాన్లపై భారీ డిస్కౌంట్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- గ్రేటర్‌లోనే 70% పెండింగ్ చలాన్స్..!

సిటీబ్యూరో, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ): పేరుకుపోయిన ఈ చలాన్లను క్లియర్ చేసుకునేందుకు రాయితీని ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022లో మార్చిలో పెండింగ్ చలాన్స్ క్లియరెన్స్‌కు 50 నుంచి 75 % వరకు కేసీఆర్ ప్రభుత్వం అవకాశమిచ్చింది. సుమారు 3 కోట్ల పెండింగ్ చలాన్లు క్లియర్ కాగా రూ.300 కోట్లు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మరోసారి కొత్త ప్రభుత్వం అదే విధంగా చలాన్స్ క్లియరెన్స్‌కు అవకాశమిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2 కోట్లకుపైగా పెండింగ్ చలాన్లు ఉండగా అందులో 60 నుంచి 70 శాతం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధికి చెందినవే ఉంటాయని పోలీసులు పేర్కొంటున్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని చలాన్లలో ఆర్టీసీ, ఆటో, ద్విచక్రవాహనాలు, కార్లు, భారీ వాహనాలకు వివిధ కేటగిరి చొప్పున డిస్కౌంట్‌ను ప్రకటించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై కాంటాక్ట్, నాన్ కాంటాక్ట్ పద్ధతిలో ట్రాఫిక్ పోలీసులు ఈ చలాన్లు జారీ చేస్తున్నారు. ఈ చలాన్లు జారీ అయిన వారు కొందరు చెల్లించినా, మరికొందరు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారు. ఎక్కువగా పేరుకుపోవడంతో స్పెషల్ డ్రైవ్ పెట్టి పేరుకుపోయిన జరిమానాలను వసూలు చేసేవారు. అయినా కూడా చాలామంది చలాన్లు చెల్లించకపోవడంతో ట్రై కమిషనరేట్ల పరిధిలో సుమారు 1.4 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో భాగంగానే తాజాగా మరోసారి అవకాశాన్ని వాహనదారులకు కల్పించారు. ఆన్‌లైన్‌లో ఈ చలాన్ పోర్టల్ ద్వారా రాయితీతో కూడిన చలాన్లు చెల్లించుకోవాలి. జనవరి 10వ తేదీ వరకు సమయం ఉంది.




ప్రదర్శనలో పెయింటింగ్ వేస్తున్న చిన్నారులు

# స్పోర్ట్స్ కార్లు అదరహో..

- ఆకట్టుకున్న సూపర్ కార్ షో
- హెచ్‌పీఎస్‌లో సందడిగా వేడుకలు
- మ్యూజికల్ ట్రియోతో ముగియనున్న హెచ్‌పీఎస్ వేడుకలు

సిటీబ్యూరో, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ): ఇక్కడ కనిపించేవన్నీ సూపర్ కార్లు.. అత్యంత విలాసవంతమైన కార్ల జాబితాలో ముందు వరుసలో ఉంటాయి. ఒకసారి కారు ఇంజిన్ స్టార్ట్ అయ్యిందంటే రయ్యుమంటూ దూసుకుపోతాయి. క్షణాల్లో పదుల కిలోమీటర్ల పికప్‌ను అందుకునే ఈ కార్ల ఖరీదు కూడా అందనీ ద్రాక్షలాగా కోట్లలోనే ఉంటాయి. హైదరాబాద్ కేంద్రంగా రాకెట్ వేగంతో దూసుకుపోయే స్పోర్ట్స్ కార్లను బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది వేడుకల్లో భాగంగా ప్రదర్శించారు. ఈ నెల 24న ప్రారంభమైన వేడుకల్లో భాగంగా రోజువారీ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ వందేళ్ల హెచ్‌పీఎస్ చారిత్రక, వారసత్వ ఔనత్యాన్ని చాటుతున్నారు. వందేళ్ల పండుగలో భాగంగా వింటేజ్ కార్లను ప్రదర్శించగా... మంగళవారం స్పోర్ట్స్ కార్లతో సూపర్ కారు షోను ఏర్పాటు చేశారు. నేటితరం యువతను ఎంతగానో ఆకట్టుకునే లగ్జరీ కార్లు హెచ్‌పీఎస్‌లో సందడి చేశాయి. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ వేడుకల్లో 12కిపైగా ఇంటర్నేషనల్ బ్రాండ్‌కు చెందిన కార్లను ప్రదర్శించారు. వీటిలో లంబోర్గిని, పోర్షేతోపాటు, బీఎండబ్ల్యూ, ఆడీతోపాటు, ఫెరారీ వంటి కార్లు ఉన్నాయి. అంతకుముందు నిర్వహించిన స్టార్ట్ ఎక్స్ సమ్మిట్‌లో పూర్వవిద్యార్థులైన సినీ ప్రముఖులు రానా దగ్గుబాటి, డైరెక్టర్ నాగ్ అశ్విన్, మెటా మాజీ ప్రొడక్ట్ మేనేజర్ సతీశ్‌తో పాటు పలువురు ఆంత్రప్రెన్యూర్లు పాల్గొన్నారు

### రీ యూనియన్ మ్యూజిక్ కన్సర్ట్..

కార్నివాల్ సంబురాల్లో భాగంగా హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక మ్యూజికల్ షో ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12గంటల నుంచి కార్నివాల్ సందడి మొదలు కాగా తొలుత హెచ్‌పీఎస్ మ్యూజికల్ బ్యాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఎంతగానో అలరించింది. సాయంత్రం 6 గంటల నుంచి రీయూనియన్ మ్యూజికల్ కన్సర్ట్ పేరిట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో కలిసి మ్యూజిక్ షోతో ఆకట్టుకున్నారు. రెండో రోజున నిర్వహించిన యూత్ పార్లమెంట్ సమావేశాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండో రోజున కొందరు విద్యార్థులు బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రాతినిధ్యం వహించారు. యూత్ పార్లమెంట్ వేడుకల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

### మ్యూజికల్ ట్రియోతో ముగింపు

భారతీయ సంగీతత్రయంగా శంకర్ మహాదేవన్, ఎహ్సాన్ నూరానీ, లాయ్ మెండోన్సాలతో కూడిన బృందం జరిగే లైవ్ మ్యూజికల్ షోతో శతాబ్ది వేడుకలు ముగియనున్నాయి. హెచ్‌పీఎస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై ఈ ముగ్గురు సంగీత కళాకారుల ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. తెలుగు, హిందీ, తమిళం, మరాఠీ, ఇంగ్లిష్ భాషల్లో ఉన్న వీరి పాటలకు విశేష ఆదరణ ఉండగా, హెచ్‌పీఎస్ వేడుకగా నిర్వహించే కార్యక్రమంలో ఈ మ్యూజికల్ ట్రయోకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.







స్టార్ట్ ఎక్స్ సమ్మిట్‌లో పాల్గొన్న సినీ హీరో రానా దగ్గుబాటి, సూపర్ కార్ షోలో భాగంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కార్లు, క్లే మోడలింగ్‌లో చిన్నారులు గీసిన చిత్రాలు